## కథ



**పి.వి.ప్రభాకరమూర్తి**

# రెండు జోడీలు

**చాలాకాలం నుండి దరిద్ర దేవత సినిమాల్లో హీరోయిన్‌లా కౌగిలించుకొని వదిలిపెట్టటం లేదు. సినిమా రంగం ముందు నాటకరంగంలా జుట్టు వెలిసిపోయింది. ఆకలిమంటని క్షణం క్రితమే అరగ్లాసుడు నీళ్లతో ఆర్పేశాను. ఓ గంట తర్వాత కానీ ఆ మంట రాజుకోదు. ఈరోజు భోజనంలోకి కూర కోసం కాబోలు, తోటకూర మొక్కల దగ్గర తచ్చాడుతోంది కనకం. కొత్తగా వచ్చిన నాలుగు ఆకులు బుట్టలో వేసుకుని విజయగర్వంతో వంటింట్లోకి వెళ్లిపోయింది. వారం నుండి అదే కూర చేసుకుంటున్నామని రోజూ పెద్ద పెద్ద ఆకులు రావు కదా!**

నిజం చెప్పాలంటే మా ఇంట్లో ఉండటానికి సరస్వతీదేవి ఇష్టపడినట్లుగా లక్ష్మీదేవి ఇష్టపడలేదు. ఆవిడ దృష్టిలో మా ఇల్లు ఓ రూరల్ ఏరియా కాబోలు. ఒకవేళ అనుకోకుండా వచ్చినా గిరుక్కున వెనక్కు వెళ్లిపోయేది ఓట్లుడగటం పూర్తయిన రాజకీయ నాయకుడిలా.

అనుకోని అతిథిలా రెండు చినుకులు నెత్తిమీద పడ్డాయి. ఇల్లు బ్రహ్మాండంగా ఉంటే చినుకులు పడుతున్నాయని లోపలికి పరిగెత్తేవాడిని. ఇంట్లోకన్నా ఈ చెట్టు కిందే నయం. అప్పుడప్పుడూ చినుకులు పలకరిస్తాయి. లోపలయితే తలముద్దయిపోయి జలుబు కూడా చేస్తుంది. ఊసలు విరిగిన గొడుగు పట్టుకుని అటూ ఇటూ తిరుగుతోంది కనకం నా వైపు అదోలా చూస్తూ. ఇది నా పుట్టింటి నుంచి తెచ్చుకున్న గొడుగే అని అలా చూసుంటుందని నాకు అనిపించింది. నేను బద్ధకస్తుడినని కనకం అభిప్రాయం. ఉద్యోగం చేసి సంసార నౌకని మునిగిపోకుండా కాపాడమని నన్ను అనేకసార్లు ప్రాధేయపడింది. పడుతోంది కూడా. కానీ మనం ఒకళ్ల కింద ఉద్యోగం చేయమని, నా అంత మొండోడు ప్రపంచంలో ఉండడని ఆవిడకు తెలిసినా అడుగుతూ ఉంటుంది పాపం.

వర్షం తగ్గింది. డొక్కు సైకిలు బయటకు తీశాను. సీటుమీద కూర్చుందామని కాలెత్తేసరికి చైను ఊడిపోయి కనిపించింది. రోడ్డు పక్కగా స్టాండు వేసి అక్కడే ఉన్న పుల్లముక్కతో చైను సరిచేసి, ఎక్కి కూర్చున్నాను. కురిసింది కొద్దిగానయినా రోడ్లన్నీ బురద పూసుకున్నాయి. నేను కరణంగారింటికి వెళ్లేసరికి ప్రైవేటు పిల్లలంతా వచ్చేశారు. అరుగు మీదకి వెళ్లి పిల్లల మధ్యలో కూర్చున్నాను.

"ఏమిత్రా సంచి" అప్పలాచారి కొడుకుని అడిగాను.

"మా నాన్న మీకు ఇమ్మన్నాడండి" సంచి చేతికందిస్తూ చెప్పాడు బంగార్రాజు.

సంచిలో ఓ ఆనపకాయ, పది వరకు ములక్కాడలు ఉన్నాయి.

"సంచి రేపు పట్టుకువస్తాన్లే" అని జాగ్రత్తగా పక్కనే పెట్టుకున్నాను.

వీడేంటి ఏ పని చేయనని చెప్పి ఈ ప్రయివేట్లేమిటి అనుకోవద్దు. ప్రయివేటు పేరుతో వారికి చెప్పినా చెప్పకపోయినా పిల్లల తల్లిదండ్రులు ఏదో ఒకటి రోజూ పంపుతారు కదా అందుకనే ఈ ప్రయివేట్లు. పిల్లలకి పాఠాలు చెప్పడం పూర్తిచేసి, సైకిల్‌కి సంచీ తగిలిస్తుంటే కరణంగారమ్మాయి "మాస్టారూ, మాస్టారూ మా నాన్నగారు ఇమ్మన్నారండి" అంటూ ఓ పొట్లాం చేతిలో పెట్టి పరిగెత్తుకు వెళ్లిపోయింది. పొట్లాం విప్పిచూశాను. తిరుపతి లడ్డూ, వెంకన్నబాబు ఫోటో ఉన్నాయి. ఫోటో కళ్లకద్దుకుని, పొట్లాం సంచిలో పెట్టాను.

రోజూ తోటకూరే కాకుండా పిల్లలు పట్టుకొచ్చే కూరగాయలు కూడా అప్పుడప్పుడూ మమ్మల్ని పలకరిస్తూ ఉంటాయి. సంచీని కనకానికి అందించి, కాళ్లు కడుక్కొచ్చేసరికి భోజనం పెట్టేసింది. పక్కనే విసనకర్రతో విసురుతూ కూర్చుంది. "ఎలా ఉందండీ కూర" అడిగింది.

"అద్భుతం" అన్నాన్నేను మరికొద్దిగా వడ్డించుకుంటూ.

"కనకం నిజానికి నువ్వేం వండినా కనకమేనే" అన్నాను. భోజనం చేసేటప్పుడు మా ఇద్దరి మధ్యన ఈ సంభాషణ మా పెళ్లయినప్పటి నుండీ జరుగుతోంది. అయినా ప్రతీరోజూ మాకు ఈ మాటలు కొత్తగానే ఉంటాయి. ఇదే మా సంసారం చక్కగా ఉందనడానికి మహత్తరమైన ఉదాహరణ.

పడక్కుర్చీలో నడుం వాల్చాను. వీధిగోడ దాదాపు కూలిపోయిందనే చెప్పొచ్చు. దాంట్లో కూర్చుంటే వీధిలో జరుగుతున్నవన్నీ చక్కగా టీవీ ముందు కూర్చుని చూసినట్లుంటుంది. వేపచెట్టు మీద పిల్లకాకి చాలాసేపటి నుంచీ తిండి కోసం గోలగా అరుస్తోంది. ఇంతలో తల్లికాకి వచ్చి దాని నోట్లో ఏదో కూరుతోంది. ఆహారం గొంతు దిగిందో లేదో మళ్లీ అరుపు మొదలెట్టింది. కాకిగోల అంటే నాకు అప్పుడు అర్థమైంది. నాకు ఆ బాధ లేదు. ఎందుకంటే నాకు పిల్లలు లేరు.

"బంగాళాఖాతంలో తుఫానుట కదా!" కిల్లీ నములుతూ అన్నారు రామయ్యగారు పొలానికి వెడుతూ.

"ఏమో తెలియదండి" రామయ్యగారి వెనకాలే నడుస్తూ అన్నాను.

"తీరానికి వంద కిలోమీటర్ల దూరంలోనే ఉందట" కాల్చేసిన చుట్టని కింద పడేస్తూ అన్నారు.

"ఇదిగో ఇవి ఉంచు, నిన్న అడిగావు కదా!" అంటూ బైండు పుస్తకంలా ఉన్న నోట్ల కట్టని తీసి, అందులో కొన్ని నోట్లు నా చేతిలో పెట్టారు రామయ్యగారు. మొన్న రామయ్యగారిని అప్పు అడిగాను. రామయ్యగారు, మా నాన్న మంచి స్నేహితులు. ఆ చనువుతోనే నేను అప్పుడప్పుడూ ఆయన్ని అప్పు అడుగుతూ ఉంటాను.

"నేను పొలం వైపు వెడతాను" అంటూ వెళ్లిపోయారు రామయ్యగారు. నేను ఇంటిదారి పట్టాను. జేబులో డబ్బు పడేసరికి నడక మారింది. ముఖాన నవ్వు భరతనాట్యం చేసింది. ఏదైనా చేసేయగలననే ధీమా మనిషికి డబ్బే ఇస్తుంది. నా మొహాన ఆనందం చూసి కనకం వెంటనే నా జేబు వైపు చూసింది. నా నవ్వుకు అర్థం కోసం నిఘంటువులు వెతక్కుండానే జేబు వైపు చూసి చెప్పేయగల సత్తా కనకానికి ఉంది. నోట్లు కనకానికి ఇచ్చాను. కళ్లకద్దుకుని లోపలికి తీసుకెళ్లింది.

కిటికీలోంచి చల్లగాలి మెల్లమెల్లగా లోపలికి వచ్చి పలకరిస్తోంది. ఆ కాస్త గాలికి దీపం ఆరిపోయింది. వెలి

గించటానికి బద్ధకించి పడక్కుర్చీలో అలాగే కూర్చు న్నాను. అప్పుడప్పుడూ ఆకాశం మెరుస్తోంది. మెరుపు వెలుగులో కనకాన్ని చూశాను ముడుచుకుని పడు కుంది. దుప్పటీ సరిచేశాను.

'నన్ను పెళ్లిచేసుకోవడమే నువ్వు చేసిన మొదటి తప్పు' మనసులో అనుకున్నాను. కనకానికి కనీసం కనకాంబరాలు కూడా తేలేని పరిస్థితి. పెళ్లయి పాతికేళ్లయింది. పెళ్లయిన కొత్తల్లో అనేది "మల్లెపూలు తేరాదూ" అని.

ఆ మర్నాడు రెండుమూర్ల పూలతో పాటు, రెండు మల్లె అంట్లు కూడా తెచ్చాను.

"చూసి రమ్మంటే కాల్చి వచ్చే రకంలా ఉన్నారే" అంది పెద్దగా నవ్వుతూ.

"ఏవీ నిరుడు కురిసిన హిమసమూహములు" అని కవి అన్నట్లుగా అప్పటికి ఆ నవ్వులేవీ. పాతికేళ్ల నా పెళ్లిపు స్తకం వెలిసిపోయి.. పెళుసుగా తయారయి ముక్కలు ముక్క లుగా రాలిపోతోందనిపిం చింది. పడక్కుర్చీలోనే తెల్లా రింది. రాత్రి కురిసిన వర్షా నికి తడిసి ముద్దయిన కాకులు రెండు గోడ మీద బుద్ధిగా కూర్చున్నాయి. పాలు పోసే రాంబాబు డ్యూటీలో దిగిపోయాడు. పక్షులు పిల్లలకి తిండి పెట్టే ప్రయత్నాల్లో పడ్డాయి. న్యూస్ పేపరు అప్పారావు పేపరు పడేసే పనిలో పడి గంటయింది. అందరూ అన్ని పనులు చేసుకుంటున్నారు. నేను మాత్రం పడక్కుర్చీలో కూర్చుని పాతికేళ్ల నుండి ఆలోచిస్తున్నాను. గడించింది ఏమీ లేదు. ఏదో చెయ్యాలి అనే నిర్ణయాన్ని ముప్పై ఏళ్ల తరువాత గట్టిగా నిర్ణయించుకు న్నాను.

అదే క్షణంలో కనకం బుర్రలో పదివేల ఆలోచనలు పడగవిప్పి నాట్యం చేస్తు న్నాయి. మావగారు అనేవారు "ఒరేయ్! పట్నం పోయి నీ దారి నువ్వు చూసుకోరా. ఇక్కడ ఎన్నాళ్లు ఉంటావు. నే సంపాదించి నీకు ఇచ్చేదేమీ లేదు కూలిపోడానికి సిద్ధంగా ఉన్న ఈ ఇల్లు తప్ప. ఏదైనా ఉద్యోగం చేసు కుని దాన్ని సుఖపెట్టు, నువ్వు సుఖపడు" అనేవారు. ఈ మాటలు ప్రతీరోజు నూరిపో సేవారు. కానీ ఈయన బెల్లంకొట్టిన రాయిలా ఉలుకుప లుకు లేకుండా నిలబడేవారు. మావగారు చెప్పిచెప్పి పదేళ్ల క్రిందట ఓ రోజు చెప్పాపెట్టకుండా కాలం చేశారు. ఆయన పోయిన తర్వాత పడక్కుర్చీ కొని తెచ్చుకుని అందులో కూర్చుని శూన్యంలోకి చూస్తూ ఆలోచించేవారు. పెళ్లయి పాతికేళ్ల యినా గోడకి కొట్టిన పిడకలా అలాగే ఉండి పోయారు. కనకం ఆలోచనలు సుళ్లు తిరుగు



తున్నాయి. ఆ ఆలోచనలు ఆచరణలో పెడితే ఎలా ఉంటుంది. కనకం మెదడు మెరుపులా పనిచేసింది ఆ క్షణంలో.

"ఏమండీ! ఉదయం కరణంగారి భార్య మళ్లె అంటు పంపింది. నాటుదామని నూతి గట్టు పక్కన కొద్దిగా గొయ్యి తీశాను, ఇంతలో పాలవాడు వస్తే లోపలికి వచ్చి దాని విషయం మరచిపోయాను. మీరు కొద్దిగా ఆ పని చూడండి, పైపైనే కాకుండా కాస్త లోతుగా నాటండి" అంది కనకం వంటగదిలోంచి. మామూలు రోజుల్లో అయితే ఆ విషయం పెద్దగా పట్టించుకునే వాడిని కాదు. ఏదో పనిచే యాలనే నిర్ణయాన్ని తీసుకుని పది నిమి షాలే కదా అయింది. ఈ మల్లె అంటుతో మన పని మొదలు పెడదాం అనుకు న్నాను.

నూతిగట్టు దగ్గరకి వచ్చి పక్కనే ఉన్న గునపంతో గొయ్యి తీయడం మొదలుపె ట్టాను. వర్షం పడటం వల్ల గునపం సర్రున నేలలో దిగిపోతోంది. రెండడుగులు తవ్వే సరికి గునపానికి ఏదో గట్టిగా తగిలిన శబ్దం వినపడింది. అది 'జాడీ' అని నెమ్మ దిగా మట్టి తీస్తుంటే తెలిసింది. ఒక నిమి షంలో జాడీని తీసి గట్టు మీద పెట్టాను. పరుగుపరుగున లోపలికి వెళ్లి కనకాన్ని పిలిచాను. ఉరుకుల పరుగుల మీద నా వెనకాలే వచ్చింది కనకం. చారడేసి కన్ను లతో జాడీవైపు చూస్తూ "త్వరగా లోపలికి తీసుకు రండి. ఎవరన్నా వస్తారు" అని తొందరచేసింది.

కొంత ప్రయత్నం మీద జాడీ మూత తీయగలిగాను. లోపల డబ్బు గిబ్బు ఏమీ లేదు కానీ ఓ కాగితం ఉంది. నిరాశ నిండిన స్వరంతో పైకి చదవడం మొదలు పెట్టాను.

"ఒరేయ్ అబ్బాయ్! నేను మీ నాన్నను. నువ్వు ఈ ఉత్తరం చదువు తున్నావంటే కష్టపడడానికి నిర్ణయిం చుకున్నావని అర్థమవుతోంది. నీ పని నువ్వు చేసుకోవడానికి కూడా బద్ధకం ప్రదర్శించే నిన్ను మార్చడం అనేది నేను బ్రతికుండగా చేయలేక పోయాను. అది నాకు సాహసమే అయింది. కష్టపడి పనిచేయలేని వాడికి కొండంత బంగారం ఇచ్చినా క్షణాల మీద దానిని గోరంత చేసే స్తాడు. అంత శక్తిమంతుడివి నువ్వు. అందుచేత ఓ నిర్ణయానికి వచ్చి రాసిందే ఈ ఉత్తరం. నువ్వు కష్టపడి డబ్బు సంపాదించి, నీ సంసారం సజావుగా సాగిపోయేలా చేసుకోవాలి. నువ్వు ఉన్న ఈ ఇంటికి చక్కని రూపం తేవాలి. ఇదంతా నువ్వు వళ్లు వంచి కష్టపడితేనే జరుగుతుంది సుమా! ఇదంతా ఐదు సంవత్సరాల్లోగా జరగాలి. దొడ్లో ఈశాన్యం మూల నేను నీకు ఇవ్వవలసినదంతా ఉంచాను. దాన్ని నువ్వు ఐదో సంవత్సరం ముగిసిపో తుందనగా మాత్రమే బయటకు తీయాలి. నా మీద ఏమాత్రం గౌరవం ఉన్నా ముందే దాని జోలికి పోవని అనుకుంటూ, మీ నాన్న సోమసుందరం"

గురిచూసి కొట్టావయ్యా దెబ్బ అను కున్నాను మనసులో. కష్టపడి ఏదో ఒకటి చేయాలని నేను నిర్ణయం తీసుకు న్నాక దొరికిన ఉత్తరం కాబట్టి నాకు నాన్న ఇచ్చిన సలహాను పట్టించుకో కుండా ఉత్తరం చింపేయాలనిపించ లేదు. దాన్ని భద్రపరిచాను. ఉత్తరంలో రాసినట్లు కాకుండా గబుక్కున ఈశాన్యం మూల తవ్వేసి ఆయన దాచింది తీసేసుకోదల్చుకోలేదు. ఉద యాన్నే వినాయకుడి గుడికి వెళ్లి స్వామిని దర్శించుకుని, కరణంగారిం టికి బయలుదేరాను.

కరణంగారు చుట్ట వెలిగిస్తుండగా నేను వెళ్లి ఆయన పక్కనే కూర్చున్నాను. ఉద్యోగం చేయటానికి నిర్ణయించుకు న్నానని చెప్పాను. అంతా విన్న ఆయన "నీ చిన్నప్పటి నుండి నేను చెవిలో ఇల్లు కట్టుకుని పోరుతుంటే ఇప్పటికి జ్ఞానోద యమయిందన్నమాట. పట్నంలో పరాం కుశం అని నా స్నేహితుడున్నాడు. వాడికి ఫోను చేసి విషయం చెపుతాను. వెంటనే సైకిలేసుకుని పట్నం బయలు దేరు" అని చుట్ట కింద పడేసి తొందర పెట్టారు కరణంగారు.

పరాంకుశంగారు రెండు మూడు సార్లు చుట్టూ తిప్పుకున్నా ఆఖరికి ఆయన ఆఫీసులో పద్దులు రాసేపని అప్పగించారు. ఎప్పుడో పూర్తి చేసిన బి.కాం డిగ్రీలో వాసనలు ఇంకా ఉన్నాయి కాబట్టి రెండు మూడు రోజులు పని చేయడానికి అవస్థ పడినా ఆరు నెలలు తిరిగేసరికి పరాంకుశం గారి నమ్మిన బంటు అయ్యాను. సంవత్సరం తిరిగేసరికి నేను ఒక రోజు ఆఫీసుకు వెళ్లక పోతే పనివాడిని ఇంటికి పంపే వారు. వ్యాపారానికి సంబంధించిన ముఖ్యమైన పనులు నాకే అప్పగించే వారు. రెండేళ్లు తిరిగేసరికి వ్యాపా రంలో ఐదు పైసల వాటా ఇచ్చారు. ఆ రోజున నా ఆనందానికి అంతే



## పేరు మార్చుకోవాలిట!

నిన్నటి హీరోయిన్ రాధ కూతురు కార్తీక 'జోష్'తో హీరోయి న్‌గా తెలుగు సినీఫీల్డుకి పరిచయమైంది. ఆమెకి తెలుగులో చాన్సుల సంగతి అలా వుంచితే- తమిళ రంగం నుంచీ ఆఫర్లు వస్తున్నాయిట. అయితే చిక్కేంటంటే- కోలీవుడ్‌లో ఆల్రెడీ ఇద్దరు హీరోయిన్‌లు 'కార్తీక' పేరుతో వున్నారట. ఇప్పుడీమె కూడా వెళ్తే మూడో కార్తీక అవుతుంది. ప్రేక్షకులకు కూడా కన్‌ఫ్యూజన్‌గా వుంటుంది. అందు కని కార్తీక తన పేరుని తమిళ సీమ వరకూ మార్చుకునే వుద్దేశంలో వుందిట.

లేదు. పరాంకుశంగారికి భక్తి ఎక్కువ. నెలకి ఒకసారి తిరుపతి వెళ్లేవారు. "మళ్లీ జన్మలోనైనా పిల్లలు కలిగేలా అనుగ్రహించు స్వామీ" అని మొక్కుకునేవారు.

ఒక రోజు పనివాడు "అయ్యగారికి వంట్లో బాగోలేదండి, అమ్మగారు మిమ్మల్ని ఉన్నపళంగా రమ్మన్నారండి" ఫోనులో చెప్పాడు.

నేను వెళ్లేసరికి పరాంకుశం గారు మంచం మీద పడుకుని ఉన్నారు. నన్ను చూసి "ఇక పిలుపు వచ్చేసినట్టేనయ్యా. దస్తావేజులు రాయించాను" అంటూ కాగితాలు నాకిచ్చారు.


ఆ రాత్రి పదింటికి పరాంకుశంగారు లోకం విడిచి వెళ్లిపోయారు. ఆయన భార్యలాగే శవం మీద పడి భోరుమన్నాను. మంచితనం మూర్తీభవించిన వ్యక్తి పరాంకుశంగారు. ఆయన ఆస్తిలో సగం వాటా నాకు రాశారు. నన్ను గౌరవించినట్లే నా భార్యను గౌరవించాలి సుమా! అని ఆవిడ బాధ్యతను నాకు అప్పగించినట్లు రాసి, నాకు అమ్మలేని లోటు తీర్చారు. ఆ రోజు రాత్రంతా పరాంకుశంగారి మంచితనాన్ని గుర్తుచేసుకుంటూ నేను కనకం, భోరుమని ఏడ్చాం.

"ఐదు సంవత్సరాలు రేపటితో పూర్తవుతాయి" రాత్రి పడుకునే ముందు కనకం గుర్తుచేసింది.

మర్నాడు ఎక్కడికీ వెళ్లలేదు. లక్ష్మీదేవికి పూజ చేసి కొబ్బరికాయ కొట్టింది కనకం. పట్టుచీరలో అచ్చు మహాలక్ష్మిలా ఉంది. వెలుగుని తరుముకుంటూ చీకటి వచ్చేసింది. సూర్యుడు కాలికి బుద్ధి చెప్పాడు. ఈశాన్యం మూల ఎప్పుడు తవ్వుదామా అని మనసు ఉవ్విళ్లూరుతోంది. ప్రస్తుతానికి ధనవంతుడిని అయినా డబ్బంటే ఎవరికి చేదు. తెల్లగా అందంగా ఉంటే మాత్రం పౌడరు రాసుకోకుండా ఉంటారా?

గునపం పట్టుకుని దొడ్డివైపు బయలుదేరాను. కనకం దీపం పట్టుకుని అనుసరించింది. నాలుగడుగులు హుషారుగానే తవ్వేశాను. అప్పుడు కనిపించింది జాడీ. అచ్చం ఐదేళ్ల క్రిందట గోతిలో దొరికిన దానిలాగే ఉంది. బయటకు తీసి ఇంట్లోకి మోసుకెళ్లాను. మూత వదులుగా ఉండి త్వరగానే వచ్చింది. జాడీలో పైసా లేదు. ఇదివరకులాగే ఒక కాగితం ఉంది. తీసి చదివాను.

"ఒరేయ్ అబ్బాయ్! నన్ను తిట్టుకుంటున్నావని తెలుసు. నువ్వు ధనవంతుడి హోదాలో ఈ జాడీని



బయటకు తీసినందుకు నా ఆత్మ ఎంతో సంతోషిస్తోంది. కష్టపడితే దేవుడు ఇష్టపడతాడని, కావల్సినంత ధనం సంపాదించవచ్చని నీకు వేరే చెప్పనవసరం లేదు. జాడీలో ఏదో ఉందని అనుకున్నావు. నువ్వు సంపాదించిన దాని ముందు నేను నీకు ఏమి ఇచ్చినా తక్కువే. యోగ్యుడవై నా ఆత్మకు శాంతి చేకూర్చినందుకు నీకు అభినందనలు. ఇట్లు మీ నాన్న సోమసుందరం"

రెండు కన్నీటిచుక్కలు కాగితం మీద పడ్డాయి.

అలవాటు ప్రకారం పడక్కుర్చీలో కూర్చున్నాను. "రేపు మీ పుట్టినరోజు" కనకం ఉదయం లేస్తూనే చెప్పింది.

ఐదు సంవత్సరాల కిందటి పుట్టిన రోజుకి ఈ పుట్టినరోజుకి ఊహించని తేడా. మనిషి జీవితంలో మార్పు రావాలంటే క్షణం పట్టదు. ఓడలు బళ్లవ్వడానికి, బళ్లు ఓడలవ్వడానికి ఆ క్షణం ఎక్కువ సమయమే.

"రేపు పుట్టిన రోజుకి అన్ని పిండి వంటలతో పాటు నాకత్యంత ప్రీతిపాత్రమైన ఆవకాయలో, వెల్లుల్లిపాయలు కలుపు" వంటింట్లోకి వెళ్లి కనకంతో అన్నాను.

"కలుపుతాను కానీ పైన ఉన్న ఆవకాయ జాడీ కిందకి దింపండి. దాన్ని దింపటం నా వల్ల కాదు. చచ్చేంత బరువుంటుంది" కనకం అంది.

ఆవకాయజాడీ అనగానే 'నాకు మా పుట్టింటి వాళ్లిచ్చిన ఆవకాయ జాడీలు రెండూ పగిలిపోయాయి. ఈసారి కొత్త జాడీలు కొనాలి' అని ఐదేళ్ల కిందట ఒక రోజు కనకం అనడం ఠక్కున గుర్తొచ్చింది.

'భూమిలో జాడీలు, మా నాన్న పేరు మీద ఉత్తరాలు..' నాలో మార్పు తీసుకురావాలని కనకం వేసిన పథకంలో భాగమే అని నాకు అర్థమవ్వటానికి ఎంతో సమయం పట్టలేదు.

విషయమంతా నాకు తెలిసిపోయిందని కనకం నా వైపు చూసి చిరునవ్వు నవ్వింది. 'నా కనకం నిజంగా కనకమే' అనిపించింది ఆ క్షణంలో. కనకాన్ని ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నాను.

## అలాంటి చాన్స్ వదులుతానా?

తెలుగులో సూపర్ హిట్ 'పోకిరి' సినిమా హిందీలో ఇటీవలే 'వాంటెడ్'గా రిలీజయింది. ఇందులో సల్మాన్‌ఖాన్‌కి జంటగా ఆయేషా టకియా నటించింది. అయితే ఆయేషాకి బదులుగా శ్రియ నటించాల్సి వుంది. కానీ ఆమె అంగీకరించకపోవడం వల్ల ఆయేషాని తీసుకున్నారనే వార్తలు ఈమధ్య ప్రచారంలోకొచ్చాయి. దీనికి శ్రియ స్పందిస్తూ- 'సల్మాన్‌తో నటించే చాన్స్ వస్తే ఎవరైనా వదులుకుంటారా చెప్పండి! నేనలాంటి పిచ్చిపని ఎందుకు చేస్తాను. ఆ సినిమాకోసం నన్నేమీ అడగలేదు, అంతే' అని తేల్చిచెప్పేసింది.